దోమలపై మొదలైన దండయాత్ర



సున్నంచెరువు వద్ద వ్యర్థాలు, గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

అల్లాపూర్, 5 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): సున్నంచెరువులో గుర్రపుడెక్క, చుట్టు పక్కల వర్థాల తొలగింపు ప్రక్రియ అధికారులు సోమవారం ప్రారంభించారు. 'దోమల విజృంభణ' అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారుల్లో చలనం వచ్చింది. దీంతో చెరువు చుట్టు పక్కల వర్థాలు, పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టారు. ఇటీవల కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూడా దోమల, స్థానిక సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు సూచనలు చేశారు. ఆలస్యంగానైనా సరే దోమల బెడద తప్పుతున్నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్, లింగాల అయిలయ్య, జావీదుద్దీన్, జ్ఞానేశ్వర్, పర్వీన్, సత్యమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న బండి రమేష్, నాయకులు

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

బాలానగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. సోమవారం ఉదయం బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన 50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పథకాలు, విధివిధానాలు నచ్చి యువకులు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మధు, నాయకులు మల్లికార్జున్‌యాదవ్, మేకల రమేష్, కే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న సాయిలుగౌడ్

బాలానగర్,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఐ కార్యదర్శి డీజీ సాయిలుగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బాలానగర్ డివిజన్ శ్రీశ్రీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. కూకట్‌పల్లి మండల కార్యాదర్శి జి.కృష్ణ, కౌన్సిల్‌సభ్యులు కే.మనోజ్‌చారి, ఎండి ఎక్బాల్, దావీద్, ఉమారాణి, చంద్రమ్మ, గోపాల్, బాలయ్య, రాములు, నాగలక్ష్మి, నాగమణి, కృష్ణచారి పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా'

షాపూర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద పలు కాలనీల నుంచి వచ్చిన ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిజాంపేట్‌కు చెందిన పలువురు యువకులు స్థానికంగా నెలకొన్న రోడ్డు, డ్రైనేజీ వంటి సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిజాంపేట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కావడియాత్రలో పాల్గొన్న భక్తులతో మదన్‌గౌడ్

ఉమామహేశ్వర ఆలయంలో పోటెత్తిన భక్తులు

షాపూర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం ఎక్స్ రోడ్డులోని ఉమామహేశ్వర ఆలయంలో శ్రావణమాసం మొదటి రోజు భక్తులు పోటెత్తారు. ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఒడిస్సా, బీహార్ రాష్ట్రాల భక్తులు పెద్ద ఎత్తున కావడియాత్ర నిర్వహించి, గంగా జలంతో శివునికి అభిషేకాలు చేశారు.

● షాపూర్‌నగర్‌లో..

సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్‌లో శ్రావణమాసం సందర్భంగా సంగీత పాత్ర నిర్వహించిన కావడియాత్రలో స్థానికులతో కలిసి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి సోమవారం పాల్గొన్నారు. వీరారెడ్డి, దుర్గయ్య ప్రతాప్, కృష్ణగౌడ్, కృష్ణ, సాయిలు, శ్రావణ్, శివ పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నేత కాంగ్రెస్‌లో చేరిక

మియాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట సాయినగర్ యూత్‌కాలనీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ సోమవారం తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో కాంగ్రెస్ డివిజన్ నాయకుడు గౌతంగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఎండి మన్సూర్‌అలీ, సాగర్‌లక్ష్మణ్, వెంకట్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, రాఫుద్దీన్, శంకర్ పూజారి, విశ్వనాథ్, దయానంద్ తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని మహిళ చెరువులో పడి మృతి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపల్‌లోని నారాయణ చెరువులో 25 నుంచి 30 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని మహిళ ఆదివారం సాయంత్రం చెరువులో దూకింది. గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు చెరువు వద్దకు చేరుకొని గజ ఈతగాళ్లతో గాలించారు. ఆదివారం రాత్రి కావడంతో మృతదేహం దొరకలేదు. సోమవారం ఉదయం గాలింపు కొనసాగించడంతో సాయంత్రం 6 గంటల సమయంలో మృత దేహాన్ని చెరువును నుంచి బయటకు తీసుకొచ్చారు. మృతురాలి గురించి చుట్టు ప్రక్కల ఆరా తీసినా ఎలాంటి సమాచారం లభించ లేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

● గుండ్లపోచంపల్లి పరిధిలోని నారాయణ చెరువులో నెల రోజుల్లోనే ఐదుగురు మృతి చెందారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువుచుట్టూ నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు..

పేకాట ఆడుతున్న 11 మంది అరెస్ట్

జీడిమెట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అస్‌బెస్టాస్‌కాలనీలో గల అమ్మ నిలయం పార్కులో పేకాట ఆడుతున్న 11 మందిని బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 లక్షలా 36 వేలా 400ల రూపాయల నగదు, 6 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, 6 సెట్ల మైక్రో చిప్ ప్లేయింగ్ కార్డ్స్ 10 సెల్‌ఫోన్లు, 2 కెమెరాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

14న గీతానగర్ నవజీవన్‌నగర్ మైక్రో ఇండస్ట్రీస్ ఎన్నికలు

బాలానగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లో ఉన్న గీతానగర్ నవజీవన్‌నగర్ మైక్రో ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 14 నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఫతేనగర్ భగత్‌సింగ్ పార్కులో ఉదయం 11 నుంచి 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



శేరిలింగంపల్లి డోయిన్స్‌కాలనీలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, అధికారులు



దిల్‌కుష్‌నగర్‌లో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు



కేపీహెచ్‌బీ వార్డు కార్యాలయంలో మొక్కలు పంపిణీ చేస్తున్న బండి రమేష్



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజల భాగస్వామ్యంతోనే

స్వచ్ఛదనం - పచ్చదనం



ఓల్డు ఎయిర్‌పోర్టు రోడ్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో జీహెచ్‌ఎంసీ సిబ్బంది

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచే లక్ష్యంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయిదు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో అధికారులు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పార్కులు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేసి అయిల్ బాల్స్ వేసి దోమలు పెరుగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. మొదటి రోజు శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో 9,200 మొక్కలను పంపిణీ చేసినట్లు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు.



విద్యార్థులతో కలిసి వీధుల్లో స్వచ్ఛదనం, పచ్చదనంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కార్పొరేటర్లతో సమావేశమైన మేయర్ కొలన్ నీలారెడ్డి



మొక్కలను పంపిణీ చేసిన మహిళలతో చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్, కమి షనర్ శ్రీహరి



బతుకమ్మ పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, స్థానికులు



దిల్‌కుష్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డితో జీహెచ్‌ఎంసీ అధికారులు, బస్తీ నాయకులు



హైదర్‌నగర్ సమతానగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, జడ్‌సీ అపూర్వ్‌చౌహాన్ తదితరులు

'బల్కంపేట' హుండీ ఆదాయం రూ.85 లక్షలు



ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చక సిబ్బంది

అమీర్‌పేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను సోమవారం లెక్కించారు. 47 రోజులకు సంబంధించి 18 హుండీల ద్వారా ఆదాయం రూ, 85,14,092 లక్షలు వచ్చినట్లు ఆలయం ఈవో క్రిష్ణ తెలిపారు. జనరల్ హుండీలలో నోట్లు రూ, 81,16,115 కాగా నాణేలు రూ, 2,58,850 వీటితో కలుపుని అన్నదానం హుండీలో రూ, 1,39,127 లక్షలు వచ్చాయి. 133 యూఎస్ డాలర్స్, 10 సింగపూర్ డాలర్స్, 25 యూఏఈ దిరమ్స్, 5 ఆస్ట్రేలియా, 10 స్కాట్‌లాండ్, 1 మలేషియన్ రింగిట్, 100 ఓమెన్ బైసా, 10 చైనా యువాన్‌లు వచ్చాయి. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 6గంటలకు ముగిసింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ సాయిబాబా గౌడ్, సుపరింటెండెంట్ రమేష్, సికింద్రాబాద్, బల్కంపేట అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి



కార్యక్రమంలో సావనీర్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు

రాయదుర్గం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ సవాళ్లను అధిగమించేందుకు విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఐఏఎస్ డాక్టర్ నర్సింహగారి తేజ్ లోహిత్‌రెడ్డి అన్నారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ అండ్ డిజైన్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) ఐఎన్‌ఐ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించా రు. ఈ వేడుకలకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ పీజే నారాయణన్, ఎఫ్‌డీడీఐ సెక్రటరీ పంకజ్‌కుమార్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్‌లో టెక్నాలజీ అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందని, ఇలాంటి సమయంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించడం వలన వారికి గుర్తింపు రావడంతో పాటు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మలని తివకళ, సీఎఫ్‌టీఐ చెన్నై డైరెక్టర్ కె.మురళీ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపస్ టూర్ వెబ్‌సైట్‌ను, సావనీర్‌ను విడుదల చేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బేగంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపి న వివరాల ప్రకారం.. బేగంపేట ప్రాంతంలో నివసించే ఓ వ్యక్తి ఆదివారం సాయంత్రం ఇం ట్లో తన కూతురు(15)ను ఒంటరిగా ఉంచి పనిమీద బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపు పెట్టి ఉంది. తలుపు తట్టినా తీయకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచాడు. ఇంట్లో నుంచి సోను(20) అనే యువకుడు తోసుకుంటూ బయటకు పరుగులు తీశా డు. ఏం జరిగిందని కూతురిని ఆరా తీయగా 'నా నోట్లో వస్త్రం కుక్కి, బయపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించాడు' అని బాలిక చెప్పిం ది. బాధితులు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రత్యేక టీం ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ చేనేత దినోత్సవం



అవార్డులు అందుకున్న చేనేత కళాకారులతో ప్రతినిధులు

మాదాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్‌లూమ్స్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డైరెక్టర్ అండ్ రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో జాతీయ చేనేత దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్, పద్మశ్రీ గజంఅంజయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20మంది కళాకారులను నేషనల్ అవార్డులతో సత్కరించారు. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు శిల్పారామం ఎప్పుడూ ముందుంటుందని కిషన్‌రావు అన్నారు.

షీటీమ్స్ అదుపులో 305 మంది పోకిరీలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బోనాల జాతరలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన 305 మంది పోకిరీలను షీటీమ్స్ అదుపులోకి తీసుకుంది. పట్టుబడ్డవారిలో 16 మంది మైనర్లు ఉన్నారు. పట్టుబడిన వారిలో 173 మందికి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి 3 రోజుల జైలుశిక్షతో పాటు రూ.1050 జరిమానా విధించారు. మిగతా వారిని కూడా త్వరలోనే కోర్టులో హాజరుపరుచుతామని షీటీమ్స్ అధికారులు తెలిపారు. అంతేకాకుండా జూలైలో వచ్చిన 115 ఫిర్యాదులపై స్పందించిన షీటీమ్స్ పోలీసులు విచారణ ప్రారంభించారు. పెళ్లిపేరుతో లైంగికదాడి, మోసం వంటి నేరాల్లో 19 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అందులో 4 పోక్సో కేసులు ఉన్నాయి. 22 మందికి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగ్ చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో నివసిస్తున్న డీఎస్ సుశీల(68)అగ్రికల్చర్ విభాగంలో పనిచేసి రిటైర్ అయ్యారు. పనిమీద మైసూర్ వెళ్లారు. హైదరాబాద్ రావడానికి మైసూర్‌లో మైసూర్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కర్నూలు వద్ద ఆమె హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అందులో 15 గ్రాముల బంగారు నల్లపూసల తాడు. రూ.30,800, సెల్‌ఫోన్ ఉంది. బాధితురాలు సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వేపీఎస్‌కు బదిలీచేశామని సీఐ తెలిపారు.

అదృశ్యమై మూడునెలలైనా లభించని ఆచూకీ

చిక్కడపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమై మూడు నెలలైనా ఆచూకీ లభించలేదు. అచ్చయ్యనగర్‌కు చెందిన జైని ప్రకాష్(58) ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తుంటాడు.పనిలో భాగంగా అప్పుడప్పుడు వేరే ప్రాంతాలకు వెళ్లి వస్తుంటాడు. ఈ ఏడాది ఏప్రిల్ 26న పనిమీద ఆదిలాబాద్ వెళ్లాడు. 29న బెంగళూరు వెళ్తున్నాని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. అతడికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వస్తోంది. ప్రకాష్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు చిక్కడపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షాపూర్‌నగర్‌లో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రవీంద్రముదిరాజ్



మహాదేవపురంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కాలనీ అసోసియేషన్ సభ్యులు



నిజాంపేటలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న ఆకుల సతీష్



బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లోని విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంధ్య ఇటీవల బాలానగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చింది. దీంతో బాచుపల్లి సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది సంధ్యను సన్మానించారు.

- దుండిగల్, ఆంధ్రజ్యోతి

పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహించే ప్రజావాణిలో పారిశుధ్య నిర్వహణపై అధిక ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మూసాపేట్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో కూకట్‌పల్లి, మూసాపేట్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్లకు సంబంధించిన ఫిర్యాదులను జడ్సీ సమక్షంలో జరిగే ప్రజావాణి సోమవారం నిర్వహించారు. జోన్ పరిధిలో 17 ఫిర్యాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజనీరింగ్‌కు సంబంధించినవని తెలిపారు.

పూర్తికాని ఎస్టీపీలు

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ జీహెచ్‌ఎంసీ పరిధిలో మురుగు, వరద నీటి సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజావాణిలో కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల డీసీలకు బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ ఫిర్యాదు చేశాడు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 2022లో ఆరు ఎస్టీపీ, ఒకటి ఎస్ఎన్‌డీపీ పనులను ప్రారంభించిన అధికారులు నేటికీ పూర్తి చేయలేదన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

షాపూర్‌నగర్: నాణ్యత లేని ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడాలని కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ ఫిర్యాదు చేశారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

గాజులరామారం: గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గాజులరామారం సర్కిళ్లలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కాలనీ అసోసియేషన్ సభ్యులు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

సమతానగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



అధికారులతో కలిసి డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదర్‌నగర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ సమతానగర్‌లో తలెత్తిన డ్రైనేజీ సమస్యను సివరేజ్ బోర్డు అధికారులతో జీహెచ్‌ఎంసీ, సివరేజీబోర్డు అధికారులతో కలిసి సోమవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమతానగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి బకెట్ క్లినింగ్ చేపట్టాలని, మ్యాన్‌హోల్‌లో నుండి ప్రతి మ్యాన్‌హోల్ వరకు బకెట్ క్లీనింగ్ ద్వారా పూడిక తీయాలని, నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని చూడాలన్నారు. ప్రజలకు ఎక్కడ చిన్న సమస్య తలెత్తిన అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సూపర్‌వైజర్ ఓంప్రకాశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.